సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 13 । జూలై । 2025



టన్ను చీనీ రూ.18,360
అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18,360, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



అన్నదాతకు అరకొర మద్దతు
కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల కనీస మద్దతు ధరలతో ఎటువంటి ప్రయోజనమూ కలిగేలా లేదని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.5°/21.2°
జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి



వినయ్ మృతిపై కుటుంబ సభ్యులతో ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

ధర్మవరం రూరల్: ప్రజలు జీవనశైలి, ఆహార నియమాలు, శారీరక శ్రమ, వ్యాధులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం సూచించారు. శనివారం ఆమె పోతుకుంట బీసీ కాలనీలో పర్యటించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన వినయ్ కుటుంబాన్ని కలసి, మరణానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, ఇతర సాంక్రమిక వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి దినచర్యలో యోగా ఒక భాగం కావాలన్నారు. ముఖ్యంగా యువత జీవనశైలి, ఒత్తిడి మీద విస్తృతంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె జబ్బుల మీద రాష్ట్ర ప్రభుత్వం 'స్టెమీ' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చెన్నారెడ్డి, మండల వైద్యాధికారులు పుష్పలత, దిలీప్, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఏఎన్‌ఎం శ్యామల, హెల్త్ అసిస్టెంట్ తిరుపాల్ నాయక్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణాలపై మెరుపు దాడులు



మెయిన్ బజారులో వాహనంలో తిరుగుతున్న కర్ణాటక పోలీసులు

హిందూపురం: కర్ణాటక పోలీసులు చోరీలకు సంబంధించి ఆభరణాల రికవరీలో భాగంగా హిందూపురంలోని బంగారు దుకాణాలపై శనివారం రాత్రి మెరుపు దాడులు చేశారు. మెయిన్ బజారులోని పలు షాపుల వద్ద విచారణ చేపట్టారు. ఒకటి, రెండు షాపుల వద్ద కొంత బంగారు సొత్తు రికవరీ చేసినట్లు సమాచారం. దొంగ ఏ షాపు పేరు చెప్తే ఆ షాపు నిర్వాహకుడిని వేధింపులకు గురిచేస్తారని పలువురు దుకాణదారులు భయపడిపోతున్నారు. పోలీసులు మాత్రం దొంగసొత్తులను హిందూపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు కొంటుంటారని చెబుతున్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన

అనంతపురం: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు 'పోక్సో' కేసు నమోదు చేశారు. వివరాలు.. అనంతపురానికి చెందిన బాలిక తల్లిదండ్రులు వ్యాపారం నిమిత్తం రోజూ బయటకు వెళ్లేవారు. 9వ తరగతి చదువుతున్న బాలిక శనివారం సాయంత్రం 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లింది. ఇంట్లో ఉన్న తాతకు కాఫీ చేసి ఇవ్వడానికి స్టవ్ వెలిగించింది. ఈ క్రమంలోనే గ్యాస్ లీకవుతోందని గమనించిన బాలిక... విషయాన్ని తన తాతకు చెప్పింది. వెంటనే ఆయన తమ ఇంటి సమీపంలో కిరాణా కొట్టు నిర్వహిస్తున్న శివారెడ్డి కుమారుడు ఆనంద రెడ్డికి తెలియజేశాడు. ఈ క్రమంలోనే ఇంటి లోపలికి వెళ్లిన ఆనంద రెడ్డి బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దంటూ బెదిరించాడు. దీనిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

అటకెక్కిన ఆరోగ్య ఆసరా

ఆసరా సాయం నిలిపేసిన కూటమి సర్కార్
- పేద రోగులకు తప్పని ఆర్థిక ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో 80,533 మందికి రూ.41.49 కోట్ల 'ఆసరా'



హిందూపురానికి చెందిన మహబూబ్ బాషా ఆటో డ్రైవర్. చేతుల కష్టం మీదనే ఇద్దరు పిల్లలు, భార్యను పోషించుకుంటున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని కాలు విరిగింది. దీంతో జిల్లా ఆస్పత్రిలో చేరగా వైద్యులు ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. వారం రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు. అయితే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో మహబూబ్‌బాషా ఆందోళన చెందుతున్నాడు. తాను కోలుకునే వరకు కావాల్సిన మందులు, ఇంటి ఖర్చులు, పౌష్టికాహారానికి డబ్బులు ఎవరిని అడగాలో తెలియక సతమతమవుతున్నాడు.

ధర్మవరానికి చెందిన శ్రీకాంత్ అవివాహితుడు. ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులతో పాటు ఇంటర్, డిగ్రీ చదివే చెల్లెలు, తమ్ముడి బాధ్యతలు తానే చూసుకుంటున్నాడు. ఇటీవల శ్రీకాంత్ రోడ్డు ప్రమాదం బారిన పడ్డాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకుని మూడు రోజుల కిందటే డిశ్చార్జ్ అయ్యాడు. అయితే అతను పూర్తిగా కోలుకునేందుకు దాదాపు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అంత వరకు కుటుంబ జీవనం ఏమిటో అర్థం కాక శ్రీకాంత్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

... జిల్లాలోని చాలా మంది రోగుల పరిస్థితి ఇదే. గతంలో అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'ఆరోగ్యశ్రీ' కింద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలతో పాటు ఆసరా పథకం కింద ప్రోత్సాహం అందించేది. కానీ కూటమి సర్కార్ ఆరోగ్యశ్రీని పథకం పేరును ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చినా... ఆసరా కింద ఇవ్వాల్సిన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దీంతో రెక్కల కష్టంతో బతికే నిరుపేదలకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఆ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

ప్రశాంతి నిలయం: ఆస్పత్రిలో వైద్యం పొంది.. శస్త్ర చికిత్సలు చేయించుకుని.. డిశ్చార్జి అయిన రోగులు కొన్నిరోజులపాటు పనిచేయలేరు. రోగి కోలుకునేంత వరకు కుటుంబం పడే కష్టాలను అర్థం చేసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ రెండో తేదీన 'ఆరోగ్యశ్రీ ఆసరా' ప్రవేశపెట్టారు. రోగి కోలుకునే వరకు రోజుకు రూ.225 నెలకు గరిష్టంగా రూ.5000 చొప్పున 'ఆరోగ్య ఆసరా' కింద జీవన భృతి ఇచ్చేవారు. రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్చి అయ్యే రోజే ఆ మొత్తాన్ని నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేసేవారు. సాధారణ ప్రసవాలకు, సిజేరియన్లకు రూ.5 వేలు, గుండె సంబంధిత శస్త్రచికిత్సలకు రూ.5 వేల నుంచి గరిష్టంగా రూ.10 వేల వరకు ఆసరా సాయం అందేది. రోగి కోలుకునే వరకు ఈ మొత్తం ఎంతో ఉపయోగపడేది. జిల్లాలో ఆరోగ్య ఆసరా పథకం ద్వారా 2024 అక్టోబర్ 31 వరకు 80,533 మంది రోగులకు రూ.41.49 కోట్లు అందజేశారు. అప్పట్లో ఈ పథకం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పేద రోగులకు అండగా నిలిచింది. 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలందించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,285 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 3,257 చికిత్సలను ప్రజలకు అందించింది. ఆరోగ్యశ్రీతో పాటు, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్, వంటి వినూత్న కార్యక్రమాలతో ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టంగా అమలు చేసింది. ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి.. క్యాన్సర్ వంటి రోగాలకు సైతం ఉచితంగా వైద్యం అందించారు.

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన 'కూటమి'..
కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసింది. ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్య భారీగా కుదించింది. అంతే కాదు ఆరోగ్య ఆసరా పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డిశ్చార్జి సమయంలో వచ్చే డబ్బులతో కోలుకునే వరకు కొంత మేర భరోసా పొందవచ్చని ఆశించే రోగులకు కూటమి సర్కారు నిర్లక్ష్యం కారణంగా తీవ్ర నిరాశ ఎదురవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఆసరా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.



ఆరోగ్య ఆసరా వివరాలు నమోదు చేయిస్తున్న రోగులు (ఫైల్)

16న నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

మడకశిర: మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు శనివారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. ఈ నెల 16న ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంతకు మునుపు నగర పంచాయతీ చైర్మన్‌గా ఉన్న లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్‌గా ఉన్న రామచంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పదవుల నుంచి తప్పుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఖాళీపడిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో 15మంది వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు, ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు ఉన్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక కొంత మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసి టీడీపీలోకి చేర్చుకోవడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

నేడు ఏఎన్ఎం రీ కౌన్సెలింగ్

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సచివాలయ ఏఎన్‌ఎంలకు ఆదివారం రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రా సరిహద్దుకు తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాలు సరిహద్దులోకి ప్రవేశించాయి. శనివారం రాత్రి 10 గంటలకు ఆంధ్రా సరిహద్దు 105–272 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్దకు నీళ్లు చేరుకున్నాయి. ఈ నెల 10న హెచ్చెల్సీకి నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇదిలాఉంటే, హెచ్చెల్సీలో మరమ్మతు, లైనింగ్, బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రా సరిహద్దులోని రెగ్యులేటర్ గేట్లను కిందకు దింపడంతో తుంగభద్ర జలాలు సరిహద్దులోనే నిలిచిపోయాయి. లీకేజీ కారణంగా 50 క్యూసెక్కుల వరకు వస్తుండడంతో పనులకు ఇబ్బంది లేకుండా అధికారులు హెచ్చెల్సీ ఒకటో డిస్ట్రిబ్యూటరీ వద్ద మట్టితో అడ్డుకట్ట వేశారు. ఈ నెల 20లోపు మరమ్మతు పనులు పూర్తి చేసి తర్వాత నీటిని తీసుకోనున్నట్లు సమాచారం.

హిందూపురం.. అభివృద్ధి శూన్యం

- మౌలిక సదుపాయాలూ కరువే
- ప్రజల సమస్యలు వినేవారెవరు?
- అతిథిగా అలా వచ్చి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ
- ఇదీ హిందూపురం నియోజకవర్గంలోని దుస్థితి



చిలమత్తూరులో నాసిరకంగా వేసిన బీటీ రోడ్డు



ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేసి వదిలేసిన పరిగి బస్టాండ్ వద్ద రోడ్డు

చిలమత్తూరు: రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తయింది. అయితే ఎన్నికల హామీల అమలును విస్మరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలోనూ విఫలమైంది. అయినా ఏడాది పాలనలో హిందూపురం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టిందంటూ టీడీపీ నేతలు కరపత్రాల ద్వారా ప్రచారం చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. అభివృద్ధి కోసం ఏకంగా రూ.171.2 కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొంటున్నా పనులు ఎక్కడ చేశారు.. ఎంత వెచ్చించారు అన్న వివరాలు పొందుపరచలేదు. ప్రజాప్రతినిధి పీఏలు, టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్ల జేబులు నింపుకోవడానికి కొన్ని పనులు చేపట్టి, బిల్లులు చేసుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చేసిన పనులకే బిల్లులు!
హిందూపురం పట్టణంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. రోడ్లపైనే మురుగు పారుతున్నా పట్టించుకునే వారు లేరు. పూడికతీత పనుల్లో కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడి పనులు చేస్తున్నట్టు జియో ట్యాగ్ చేసి, చేసిన పనులకే బిల్లులు పెట్టించుకునే ఎత్తుగడ వేశారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కౌన్సిల్‌లో ప్రశ్నించినా జియో ట్యాగింగ్ చూపి నిధుల మంజూరుకు మార్గం సుగమం చేసుకున్నారు. ఇలా పట్టణంలో నాసిరకం పనులు చేసి రూ.లక్షలు దండుకుంటున్న వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

- పట్టణంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న కాలనీలు అనేకం ఉన్నాయి. రూ.18.5 కోట్లు ఖర్చు చేసి సీసీ డ్రెయిన్లు, రోడ్లు, వీధి దీపాలు వేశామని ప్రచారం చేసుకుంటున్న నాయకులు.. మరి రోడ్లపైకి మురుగు ఎందుకు వస్తుందో సమాధానం చెప్పలేకపోతున్నారు.

మున్సిపాలిటీలో రోడ్లు అధ్వానం..
ఏడాది పాలనపై ముద్రించిన కరపత్రంలో పేర్కొన్నట్లు హిందూపురం మున్సిపాలిటీలో రోడ్లు లేవు. ఏడాది క్రితం పరిగి బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేసిన రోడ్డు పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. రైల్వే రోడ్డు విస్తరణ ముందుకు సాగలేదు. ఇరుకైన గుంతల రోడ్డులోనే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఇది ప్రధానమైన రోడ్డు కాగా.. ఆక్రమణదారులకు సహకరించే క్రమంలో విస్తరణ పనులు కావాలనే ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొటిపి రహదారి గుంతలమయంగా మారింది. డీబీ కాలనీలో రోడ్లే లేవు. అక్కడక్కడా గుంతలు పూడ్చి వాటిని రోడ్ల మరమ్మతుల కింద పాలకులు జమకట్టేశారు. వీటి కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశామని పేర్కొనడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నియోజకవర్గంలోని లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పొలాలకు దారుల ఏర్పాటు పేరుతో ఉపాధి హామీ నిధులు వెచ్చించారు. అయితే రియల్టర్ల భూములున్న ప్రాంతాలకు రోడ్లు వేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. చిలమత్తూరు మండలంలో రోడ్లు లేని గ్రామాలున్నా వాటిని ఏమాత్రమూ పట్టించుకోలేదు. చిలమత్తూరులో జనవరిలో అంబేడ్కర్ విగ్రహం నుంచి వడ్డి చెన్నంపల్లి వరకు, ప్రభుత్వ ఆస్పత్రి వరకు రహదారి నాసిరకంగా వేసి బిల్లులు చేసుకున్నారు. ఆ రోడ్లు కూడా పెద్ద వర్షం వస్తే కంకర తేలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. సంజీవరాయునిపలి రహదారి గుండా రోడ్డు మరమ్మతులు నాసిరకంగా చేసి మమ అనిపించారు. ఎస్.ముద్దిరెడ్డిపల్లి, మదిరేపల్లి వంటి రహదారుల దుస్థితి కూడా అధ్వానంగానే ఉంది.

అభివృద్ధి అంతా బూటకం



ఎమ్మెల్యే బాలకృష్ణ ఏడాది పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటు. ఎన్నికల సమయం తప్ప ఆయన ఏనాడైనా ప్రజల బాగోగులు విన్నారా..? చుట్టం చూపుగా అలా రావడం.. వెళ్లిపోవడం తప్పితే ప్రజలకు చేసిందేమీ లేదు. స్థానికేతరులకు పట్టం కట్టిన ప్రజలపై ఇలా చిన్నచూపు చూడటం సరికాదు. ప్రజల ఆలోచనల్లోనూ మార్పు రావాలి.
– టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, హిందూపురం

రామగిరి ఎంపీపీ ఎన్నికకు రాంరాం

- బహిష్కరిస్తున్నామని పలువురు ఎంపీటీసీల ప్రకటన
- రెడ్‌బుక్ పాలనలో పేట్రేగిపోతున్న అరాచకాలు
- మహిళలపైనా పెరుగుతున్న దారుణాలు

సాక్షి,టాస్క్‌ఫోర్స్: అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజాస్వామ్యానికి పాతరేసి అరాచకాలతో పేట్రేగిపోతున్నందున ఈ నెల 16న జరిగే రామగిరి ఎంపీపీ ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మమ్మ, బాలకొండప్ప, సాయిలీల, సుజాతమ్మ, భారతమ్మ, ఆదిలక్ష్మి ప్రకటించారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా 'సాక్షి'తో మాట్లాడారు. ప్రస్తుతం రాజుల పాలన, బ్రిటిష్ పాలనకు మించి దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. దారుణాలు, దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయంటూ ఇటీవల జరిగిన పలు ఘటనలను ఉదహరించారు. పాపిరెడ్డిపల్లిలో కురువ లింగమయ్య హత్య, దళిత బాలికపై టీడీపీ గూండాల సామూహిక అత్యాచారం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో ఆయన ప్రాణాలకు కావాలనే కల్పించిన భద్రత లోపాలను గుర్తు చేశారు. ఎంపీపీ ఎన్నికకు సంబంధించి అప్పట్లో రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో అనెగ్జర్ లెటర్ ఇవ్వడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడిచేయడం, అనంతరం మహిళా ఎంపీటీసీ సభ్యురాలను బెదిరించి టీడీపీ నాయకులు తీసుకెళ్లడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. మహిళలపైనా రోజురోజుకూ దాడులు, దారుణాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. ఈ మండలంలోకి కనీసం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా అడుగు పెట్టలేని పరిస్థితుల్లో, రామగిరి ఎంపీపీ స్థానం మహిళలకు రిజర్వు కనుక మహిళా సభ్యులు తమవైపే ఉన్నా జరిగిన పరిణామాల నేపథ్యంలో మూడోసారి నిర్వహించి తలపెట్టిన ఎంపీపీ ఎన్నికను తాము మూకుమ్మడిగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. రెడ్‌బుక్‌ను పక్కనపెట్టి అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించి ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా అధికార యంత్రాంగం పనిచేయాలని ఆకాంక్షించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం ఎంతమాత్రమూ సబబు కాదన్నారు.

మైమరపించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి యూత్

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైభవం చాటుతూ సత్యసాయి యూత్ నిర్వహించిన సంగీత కచేరీ భక్తకోటిని మైమరపింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన అమెరికాకు చెందిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్–1 కు చెందిన సత్యసాయి యూత్ శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో 'సాయి ప్రేమామృత ధార' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి భక్తి గీతాలతో మృదు మధుర స్వరాలొలికిస్తూ సాగిన సంగీత కచేరీ ఆకట్టుకుంది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అన్నదాతకు అరకొర మద్దతు

- వరి ధాన్యానికి కేవలం రూ.69 పెంపు
- రూ.480 పెంచి వేరుశనగకు మద్దతు ధర క్వింటా రూ.7,263
- కంది రూ.8 వేలు, పత్తికి రూ.8,110, మొక్కజొన్న రూ.2,400
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు



అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా 2025 ఖరీఫ్ పంట ఉత్పత్తులకు ప్రకటించిన కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైసెస్-ఎంఎస్‌పీ)లు రైతులకు పెద్దగా ప్రయోజనం కలిగేలా లేవని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటు కేంద్రం .. ఇటు రాష్ట్రంలో కూటమి సర్కారు అన్నదాత సంక్షేమానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదనడానికి మద్దతు ధరలే నిదర్శనమని గుర్తు చేస్తున్నారు. పంటల వారీగా రైతులు పెడుతున్న పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు, మార్కెట్‌లో పలుకుతున్న ధరలు, రైతులకు లభిస్తున్న నికరాదాయం... తదితర గణాంకాలు పరిగణలోకి తీసుకుని దేశవ్యాప్తంగా గత ఐదేళ్లుగా ఖరీఫ్ పంటలకు ముందస్తుగానే ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే.

వరికి నామమాత్రం

ఈ సారి ఖరీఫ్‌కు సంబంధించి ఇటీవల 17 పంటలకు కేంద్రం ఎంఎస్‌పీ ప్రకటించింది. అందులో వరి ధాన్యానికి పెద్దగా ప్రయోజనం లేకుండా గతేడాది కన్నా కేవలం రూ.69 పెంచడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. వేరుశనగ విషయానికి వస్తే గతేడాది కన్నా రూ.480 పెంచి క్వింటా రూ.7,263 ఖరారు చేశారు. అలాగే గతేడాది కన్నా పత్తికి రూ.589, కందులకు రూ.450, మొక్కజొన్నకు రూ.175 మేర పెంచారు.

ఎంఎస్‌పీ లేకుంటే కొనుగోళ్లు

ఖరీఫ్ పంట ఉత్పత్తులు చేతికొచ్చిన సమయంలో బహిరంగ మార్కెట్‌లో ఎంఎస్‌పీ కన్నా తక్కువగా ధరలు ఉంటే.. వరి, వేరుశనగ, కంది, జొన్న, మొక్కజొన్న, కొర్రలు, రాగులు, సజ్జలు, పత్తి తదితర పంట ఉత్పత్తులను ఆర్‌బీకే వేదికగా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ సహకారంతో పౌరసరఫరాలశాఖ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఏపీ సీడ్స్, ఆయిల్‌ఫెడ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తదితర కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నోడల్ ఏజెన్సీలు, కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 15 రోజుల్లోగా రైతులకు సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. అయితే గతేడాది చంద్రబాబు ప్రభుత్వం అరకొరగా కందులు, ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి మిగతావి ఏమీ కొనుగోలు చేయకపోవడంతో రైతులు అందినకాడికి పంటలు అమ్మేసుకుని నష్టపోయారు.

పంటల వారీగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వివరాలిలా..

పంట	గతేడాది	ఈఏడాది	పెరిగిన ధర (రూ.లో)
వరి (సాధారణం)	2,300	2,369	69
వరి (ఏ-గ్రేడు)	2,320	2,389	69
మొక్కజొన్న	2,225	2,400	175
జొన్న (మాల్దండి)	3,421	3,749	328
జొన్న (హైబ్రీడ్)	3,371	3,699	328
సజ్జలు	2,625	2,775	150
పెసలు	8,682	8,768	86
మినుములు	7,400	7,800	400
నువ్వులు	9,267	9,846	579
పొద్దుతిరుగుడు	7,280	7,721	441
సోయాబీన్	4,892	5,328	436

క్లుప్తంగా

లేపాక్షి ఆలయంలో శిల్పకళ అద్భుతం



ఎమ్మెల్సీ సురభివాణీదేవిని సత్కరిస్తున్న దృశ్యం

లేపాక్షి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి ఆలయంలో ఉన్న శిల్పకళ, చిత్రలేఖనాలు అద్భుతంగా ఉన్నాయని మాజీ ప్రధాని పీవీ నరసింహరావు కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి పేర్కొన్నారు. శనివారం ఆమె లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రాలేఖనాలను తిలికించి ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ విశిష్టతను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

పశువులను తరలిస్తున్న కంటైనర్ల అడ్డగింత

నల్లచెరువు: మండల పరిధిలోని పెద్దయల్లంపల్లి సమీపంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న నాలుగు కంటైనర్ వాహనాలు, లారీని గ్రామస్తులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై కంటైనర్లు ఆపిన గుర్తు తెలియని వ్యక్తులు వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన గ్రామస్తులు, కంటైనర్లలో ఏముందని ప్రశ్నించారు. ఇందుకు వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. కంటైనర్లను అడ్డుకొని చూడగా అందులో అక్రమంగా పశువులను తరిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చినా వారి నుంచి ఎలాంటి స్పందనాలేదని తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లికి చెందిన అనంతరాజుపై హత్యాయత్నం ఘటనలో మైలాపురానికి చెందిన చింతకుంట విజయ్‌కుమార్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొలగానహళ్లికి చెందిన అనంతరాజు కొంతకాలంగా మైలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేత సంబంధం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై వివాదం తలెత్తి ఈనెల 7న అనంతరాజుపై చింతకుంట విజయ్‌కుమార్‌రెడ్డి దాడి చేసి గాయపరిచాడన్నారు. అనంతరాజు, ఆయన బంధువులు మైలాపురం చేరుకొని విజయ్‌కుమార్‌రెడ్డి ఇళ్లల్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు వరి గడ్డికి నిప్పు పెట్టి ఆస్తి నష్టం చేశారని పేర్కొన్నారు. ఆస్తి నష్టం చేసిన 21 మందిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపించామన్నారు. అనంతరాజుపై దాడికి పాల్పడిన విజయ్‌కుమార్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని వెల్లడించారు. శనివారం మైలాపురం గ్రామంలో విజయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పుట్టపర్తి మహిళా పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచిన ట్రాక్టర్లు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి చిత్రావతి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకెళితే.. 'పుట్టపర్తిలో ఉసుక తోడేళ్లు' అన్న శీర్షికన ఈనెల 6న 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అర్బన్ పోలీసులు గత నాలుగు, ఐదు రోజుల నుంచి చిత్రావతి నదిలో కాపుకాసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీనికిపై 'సాక్షి' సీఐ సునీతను వివరణ కోరగా ట్రాక్టర్లు తీసుకొచ్చాము .. విచారించి కేసు నమోదు చేస్తాము. అనంతరం వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్‌పై దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్‌పై దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. టీచర్స్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ బాషా ఈనెల 8న మొహర్రం వేడుకల్లో పీర్ల ఊరేగింపులో ఉండగా మద్యం తాగి వచ్చిన వన్నూరు వలి అందరితో గొడవపడుతున్నాడు. దీంతో బాషా పక్కకు వెళ్లాలని చెప్పి పంపించారు. అది మనసులో పెట్టుకున్న వన్నూరువలి అతని స్నేహితుడు నరేష్‌తో కలసి శుక్రవారం రాత్రి బాషా ఇంటి వద్దకు వెళ్లి గొడవ పెట్టుకొని దాడి చేశారు. బాధితుడి భార్య, స్నేహితులు వారి నుంచి రక్షించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై శనివారం బాషా ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం

యాడికి: ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలమేరకు.. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నివసిస్తున్న వేములపాడు యజ్ఞాన్ బాషా తన కుమార్తె ఎంబీబీఎస్ సీటు కోసం విజయనగరం జిల్లాకు చెందిన రామారావు, గణేష్‌లకు 2021 సంవత్సరంలో రూ.3,30,000 ఇచ్చారన్నారు. కరోనాతో కాలేజీలు మూతపడ్డాయని, కాలేజీలు తెరిచిన వెంటనే సీటు కచ్చితంగా వస్తుందని నమ్మించినట్లు తెలిపారు. నాటి నుంచి నేటికీ కూతురు చదువుకు ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వలేదన్నారు. యజ్ఞాన్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంటల సాగులో మెలకువలు అవసరం

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి



వ్యవసాయ పరికరాలను అందిస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి


బుక్కరాయసముద్రం: పంటల సాగులో మెలకువలు ఎంతో అవసరం అని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కేవీకేలో అటారి, హైదరాబాద్ ప్రిన్సిపల్ సైంటిస్టు రెడ్డికి రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, మెలుకువలు తప్పక పాటించాలన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ ప్రాముఖ్యతను వివరించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త శశికళ, డాక్టర్ మాధవి వెటర్నరీ శాస్త్రవేత్త, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త చందన తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



బాలాజీ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి చలపతి



బాలాజీ (ఫైల్)

బుక్కరాయసముద్రం: కుమారుడిని ఉన్నత స్థానంలో చూడాలని ఆ తల్లిదండ్రులు కలగన్నారు. అందుకే పెద్ద చదువులు చదివించారు. మంచి ఉద్యోగం సాధించేలా కుమారుడి వెన్నంటే ఉండి ప్రోత్సహించారు. అతనూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడంతో వారి ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. అయితే దేవుడు చిన్నచూపు చూడటంతో వారి సంతోషం ఎక్కువ రోజులు నిలబడలేదు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. వివరాల్లోకెళితే.. చలపతి, జయమ్మ తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్నారు. చలపతి ఓ గ్రానైట్ షాపులో రైటర్‌గా పని చేస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు పెళ్లి చేశారు. కుమారుడు కడవ బాలాజీ (26) బెంగళూరులోని టెక్ మహేంద్రలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. 15 రోజులు ఆఫీసులో.. 15 రోజులు వర్క్‌ఫం హోం చేసేవాడు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారు జామున బెంగళూరు నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. అయితే బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో అనంతపురం – తాడిపత్రి జాతీయ రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో బాలాజీ తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు హెల్మెట్ ఉన్నా ప్రాణాలను కాపాడలేకపోయింది. విషయం తెలుసుకున్న తండ్రి చలపతి సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నామని, ఇంకా కొన్ని రోజులు ఆగండి నాన్నా... మంచి జీతం వస్తుందని చెప్పేవాడని , ఏదీ జరగకుండానే అప్పుడే నూరేళ్లు నిండాయా అని రోధించడం పలువురిని కంటతడి పెట్టించింది. సీఐ పుల్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

- 9 కేసులలో బంగారు, కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం



దొంగతో పాటు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు చూపుతున్న పోలీసులు

హిందూపురం: హిందూపురం రూరల్ పరిధిలోని కిరికెర సమీపంలో మిట్టమీదపల్లి వద్ద జరిగిన ఇంటి దోపిడీ కేసులో ధర్మవరం కేతిరెడ్డికాలనీకి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ సిక్ బాజాపీరాను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 9 కేసులకు సంబంధించిన 201.6 గ్రాముల బంగారు నగలు, హుండాయ్ కారు, పల్సర్ మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ తెలియజేశారు. గత నెల 26న మిట్టమీదపల్లి వద్ద వెంకటాద్రి లేఅవుట్‌లో నివాసం ఉంటున్న సిమెంట్ వ్యాపారి నిత్యానందారెడ్డి ఇంట్లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారన్నారు. తుపాకులు, కత్తులతో బెదిరించి సుమారు 20 తులాల బంగారు నగలు, రూ.5 వేలు నగదు దోచుకెళ్లారన్నారు. సీఐలు చంద్ర ఆంజనేయులు, జనార్ధన్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఆఖరికి ధర్మవరం పట్టణానికి చెందిన సిక్ బాజాపీరాను కొడికొండ వద్ద అదుపులకి తీసుకొని అతనిచ్చిన సమాచారం మేరకు పలు ప్రాంతాల్లో మిగిలిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల కోసం గాలింపు చేస్తున్నట్లు చెప్పారు. చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగగా మారడన్నారు. ఇతను కర్ణాటక రాష్ట్రంలో పలు దొంగతనాలు చేసి చిక్కబళాపురం సబ్‌జైలుకెళ్లాడని, అక్కడే పరిచయమైన నార్త్ ఇండియాకు చెందిన ముఠాతో పరిచయం ఏర్పడి పలు పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసి బంగారు, వెండి ఆభరణాలు దోచుకుని అమ్ముకొని డబ్బులు చేసుకొనేవారన్నారు. దొంగను పట్టుకోవడంతో చాకచక్యంగా వ్యవహరించిన హిందూపురం సీఐ చంద్ర ఆంజినేయులు, చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్, క్రైమ్ సిబ్బందికి రికార్డులు అందిసున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతోనే ఉద్యోగావకాశాలు

- దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ బోర్డు మెంబర్ విజయ్ ప్రతాప్ సింగ్



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రైల్వే బోర్డు సభ్యులు విజయ్‌ప్రతాప్‌సింగ్

గుత్తి: ప్రపంచమంతా కంప్యూటర్ చుట్టే తిరుగుతోందని దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ బోర్డు మెంబర్ విజయ్ ప్రతాప్ సింగ్ అన్నారు. గుత్తిలోని కర్నూలు రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వెబ్ టెక్ కంపెనీ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌ను విజయ్‌ప్రతాప్ సింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. కంప్యూటర్ జ్ఞానం ఉంటే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. రోజూ కనీసం గంట పాటైనా కంప్యూటర్ నేర్చుకోవాలన్నారు. కంప్యూటర్ జ్ఞానం ఉంటే కచ్చితంగా ఉన్నత స్థానాలకు చేరువకావచ్చన్నారు. సాధారణ విద్యతో పాటు కంప్యూటర్ విద్యను కూడా నేర్చుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, వెబ్ టెక్ కంపెనీ ప్రతినిధి నిరంజనీస్, సీనియర్ డీఎంఈ ప్రమోద్, హెచ్‌ఎం సుంకన్న కంప్యూటర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వెబ్ టెక్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ డ్యామ్ ప్రారంభం..

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి వద్ద చెక్ డ్యామ్‌ను రైల్వే బోర్డు మెంబర్ విజయ్ ప్రతాప్ సింగ్ ప్రారంభించారు. అనంతరం డీజిల్ షెడ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఎంఈ అశోక్ గౌడ్, ఎస్ఎస్ఈ మనోజ్ , గోవిందరాజులు, రాజేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

అనంతపురం: అవసరాలకు అడిగినా డబ్బు ఇవ్వలేదని భర్తపై భార్య అలిగి.. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. అనంతపురం నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదర్‌థెరీనా కాలనీలో నివాసం ఉంటున్న నారాయణ నాయక్ భార్య దేవీబాయి వారం రోజుల కిందట ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయింది. భర్త నారాయణ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెబాట

- సమస్య పరిష్కరించాలని 20 రోజులుగా ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల దీక్షలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రేపటి నుంచి సమ్మెలోకి వెళ్లనున్న కార్మికులు



పుట్టపర్తిలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెబాట పట్టనున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలోని కార్మికులు సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు.

500 మంది దాకా ...

గత 20 రోజులుగా ఇంజనీరింగ్ విభాగంలోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్కర్స్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం దీక్షలు, నిరసనలు, ఆందోళనలు నిర్వహించారు. అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దాదాపుగా 500 మంది దాకా ఉన్నారు. పట్టణాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరాలో వీరి సేవలు కీలకం. వీరంతా సమ్మెలోకి వెళితే ఆయా పట్టణాల్లో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడనున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇలా..

జీఓ నంబర్ 36 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. హెల్త్ అలవెన్సులు, రిస్క్ అలవెన్సులు అమలు చేయాలి. ఆప్కాస్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి. కార్మికులకు రూ.29 వేలు జీతం ఇవ్వాలి. హెచ్‌ఆర్ పాలసీ పరిధిలోకి తీసుకెళ్లాలి. రిటైర్మెంట్ అయినా, చనిపోయినా, అనారోగ్యం పాలైనా వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి. కార్మికులకు గ్యాట్యూటీ ఇవ్వాలి. కారుణ్య నియామకాలు చేపట్టాలి. జాతీయ పండుగలకు క్యాజువల్ లీవులు, వారాంతపు సెలవులు అమలు చేయాలి. కార్మికులందరికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలి.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఎన్నో సమస్యలతో సతమవుతున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం 20 రోజులుగా వివిధ రకాలుగా నిరసనలు చేస్తున్నాము. సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. రాష్ట్రంలో అన్ని యూనియన్లు మద్దతుగా నిలుస్తున్నాయి. కార్మికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

– గంగాద్రి, సీఐటీయూ మండల కన్వీనర్

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఇంజనీరింగ్ విభాగంలో 14 సంవత్సరాలుగా పనిచేస్తున్నాము. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం లేదు. కొత్త వారికి పాతవారికి ఒకే జీతం ఇస్తున్నారు. సర్వీసు, అర్హత గుర్తించి రెగ్యులర్ చేయాలి. పేద, మధ్య తరగతి చెందిన కార్మికులను దృష్టిలో ఉంచుకొని కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

– రమణ, మున్సిపల్ యూనియన్ వర్కర్ల జిల్లా అధ్యక్షుడు

పట్టించుకోకపోవడం అన్యాయం



మేమంతా 20 రోజులుగా న్యాయపరమైన డిమాండ్ల కోసం నిరసన తెలిపాము. అయినా కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. స్థానిక ప్రజాప్రనిధులు, మంత్రులు కూడా పర్యటనలు చేస్తున్నా మా సమస్యలను పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా మా న్యాయపరమైన డిమాండ్లు పరిష్కారించాలి.

– తిరుపాల్‌నాయక్, ఇంజనీరింగ్ కార్మికుడు